## బక్రీద్ శుభాకాంక్షలు



ఎమ్మెల్యే వెంకటేశ్

గోల్నాక, జూన్ 6 : బక్రీద్‌ను పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గం ముస్లింలకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుభాకాంక్షలు తెలిపారు. వారికి అల్లా ఆశీస్సులు లభించాలని ఆకాంక్షించారు. బక్రీద్‌ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో, జరుపుకోవాలని అన్నారు. బక్రీద్‌కు నియోజకవర్గంలోని మజీదులు, ఈద్గాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



బక్రీదును ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి అన్నారు. పండుగను పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ ద్వారా అందజేసే డస్ట్‌బిన్ కవర్లను డివిజన్‌లోని వివిధ మసీదుల వద్ద మత పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ హరినాథ్, బీఆర్‌ఎస్ నాయకులు మిర్యాల శ్రీనివాస్, ఎన్.వెంకటరమణరాజు, టి.కిరణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూన్ 6

## గోల్నాకలో..




బక్రద్‌ను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బక్రీద్ సందర్భంగా శుక్రవారం జీహెచ్‌ఎంసీ సరఫరా చేసిన శానిటరీ కవర్లను డివిజన్‌లోని లాల్ మజీదు నిర్వాహకులకు అందజేశారు. బక్రీస్ సందర్భంగా డివిజన్ లోని మజీదుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని ఆమె తెలిపారు.

– గోల్నాక, జూన్ 6

## ముత్యాలమ్మ వార్షికోత్సవాలు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 6 : నాంపల్లి బజార్‌ఘాట్ చౌరస్తా బంగారు ముత్యాలమ్మ దేవాలయము 4వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి అభిషేకం, హోమం ఘనంగా నిర్వహించారు. అనంతరం పల్లకి సేవలో అమ్మవారిని బజార్ ఘాట్ పరిసర ప్రాంతాలలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మణ్, రమేశ్‌జైస్వాల్, గిరిధర్, అర్జున్‌యాదవ్ పాల్గొన్నారు.

# జయశంకర్‌ను తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి



అభివాదం చేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ అధ్యక్షుడు మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి

రవీంద్రభారతి, జూన్ 6 : తెలంగాణ కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన ఆచార్య జయశంకర్ సార్‌ను తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిగిల్ల శ్రీనివాసచారి, శిలా శిల్పి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శశిధర్ శిల్పిలు మాట్లాడారు.ఈ సందర్భంగా మదన్మోహన్ మాట్లాడుతూ తెలంగాణ జాతిపితగా ఆచార్య జయశంకర్‌ను ప్రకటిస్తూ జీవో జారీచేయాలని డిమాండ్ చేశారు. అలాగే హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై జయశంకర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. వరంగల్ జిల్లాలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న విమానాశ్రమానికి ఆచార్య కొత్తపల్లి జయశంకర్ నామకరణం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కోసం తన జీవితాన్ని అగ్నికి ఆహుతి చేసుకున్న శ్రీకాంతచారికి తెలంగాణ జాతిరత్న ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ,విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. దేవరకొండ వీరాచారి, పబ్బోజు బిక్షపతి, ఎర్రోజు వేణుగోపాల్, నారోజు జగ్‌జీవన్, చిలుకూరు లక్ష్మీరామాచారి, దాసోజు పుష్పలత, శశిధర్ శిల్పి, బైరోజు రవీంద్రాచారి పాల్గొన్నారు.

## గ్రూపు సభ్యులకు సన్మానం



అవార్డులు అందుకున్న గ్రూపు సభ్యులను సన్మానిస్తున్న డీసీ మారుతీ దివాకర్, పీఓ రజిత తదితరులు

అంబర్‌పేట, జూన్ 6: అంబర్‌పేట సర్కిల్ పరిధిలోని హిమాయత్‌నగర్ డివిజన్ ఫరీద్ బస్తీ ప్రాంతంలో జీవీ పాయింట్‌ను తొలగించినందుకు స్టార్ సెల్ఫ్ గ్రూపు సభ్యులకు తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అవార్డులు ఇచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డులను అందజేశారు. ఈ నేపథ్యంలో సర్కిల్ డీసీ ఎ.మారుతీ దివాకర్, పీఓ యూసీడీ రజిత, ఏఎంసీ రవీందర్‌లు శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో అవార్డులు పొందిన రహీమున్నీసా, షాహిదాలను శాలువాతో సన్మానించారు. అభినందనలు తెలియజేశారు.

## పెండింగ్ సమస్యల పరిష్కార దిశగా నిర్ణయాలు అభినందనీయం



సుల్తాన్ బజార్, జూన్ 6: ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ సమస్యల పరిష్కార దిశగా నిర్ణయాలు ప్రకటించడం అభినందనీయమని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. ముజీబ్ హుస్సేనీ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మరియు క్యాబినెట్ సబ్‌కమిటీ అధ్యక్షుడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, గౌరవ మంత్రులు డి.శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అధికారుల త్రిసభ్య కమిటీ నవీన్ మిట్టల్, డీఎస్ లోకేశ్‌కుమార్, డి. కృష్ణ భాస్కర్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం 2 డీఏలను ప్రకటించడంపై, ఉద్యోగస్తులకు హెల్త్‌కార్డ్స్, పెండింగ్‌లో ఉన్నటువంటి బిల్లులను ప్రతినెలాల రూ.700 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## అంబర్‌పేట నియోజకవర్గంలో బడిబాట ప్రారంభం




బడిబాట కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అంబర్‌పేట, జూన్ 6 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల కోసం జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆచార్య జయశంకర్ బడిబాట అంబర్‌పేట నియోజకవర్గంలో శుక్రవారం ప్రారంభమైంది. 12న పాఠశాలలను అలంకరించాలని, పండగ వాతావరణంలో తల్లిదండ్రులకు స్వాగతం పలకాలని, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం) నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తూ పెద్ద ఎత్తున సమావేశాలు నిర్వహించారు.

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కాచిగూడ : పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి, ఉపాధ్యాయులు ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని కార్పొరేటర్ ఉమా యాదవ్ అన్నారు. శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు అయ్యారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, ప్రధాన ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సిబ్బంది స్నేహలత, అనిత, సమరత, సునీత, వీరేష్ తోపాటు భీమ్రాజ్, రాము, సూరి, కృష్ణ, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలి

అబిడ్స్, జూన్ 6 : బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పట్టణ సభకు డీఈవో రోహిణి హాజరై పిల్లలు వారి తల్లిదండ్రులతో ముచ్చటించారు. ప్రభుత్వ పాఠశాలలలో ప్రత్యేకంగా ఏర్పరిచిన సౌకర్యాలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న డిజిటల్ తరగతుల గురించి ముచ్చటించారు. గత సంవత్సరం ప్రతిభ కనబరిచిన కొందరు విద్యార్థులకు పాఠశాల సిబ్బందికి పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి బాలు నాయక్, డిప్యూటీ ఐఓఎస్ మదన్మోహన్ రెడ్డి, ఏ మధునిక తదితరులు పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి

## అలరించిన ఎస్పీ బాలు సినీ గీతాలు



సినీగీతాలను ఆలపిస్తున్న గాయని గాయకులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 6 : గానగంధర్వుడు ఎస్పీ బాల సుబ్రమణ్యం ఆలపించిన సినీ గీతాలను పలువురు ఔత్సాహిక గాయకులు గానం చేసి స్వరనీరాజనం పలికారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో పద్మ విభూషణ్ డాక్టర్ ఎస్పీ బాల సుబ్రమణ్యం జయంతిని పురస్కరించుకుని ఎస్పీ బాలు సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కచేరీ సంగీత ప్రియులను విశేషంగా అలరించింది. గాయకులు కృష్ణ, అనుదీప్, సాహితీ, సింహా, కృష్ణ చైతన్య, గాయత్రి, శృతి, శ్రీదేవి, జయంత్ తదితరులు శ్రావ్యంగా ఆలపించి రసజ్ఞులైన సంగీత ప్రియుల ప్రశంసలు అందుకున్నారు. నిర్వాహకులు గోవింద్ ఆచార్య, చెన్ను హరే రామ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్పీ బాల సుబ్రమణ్యం పాటలు సంగీత ప్రపంచంలో చిరస్థాయిగా నిలుస్తాయని అన్నారు. అనంతరం గాయని గాయకులను సత్కరించారు.

## తెలంగాణ జలాలను ఆంధ్రకు తరలించకుండా అడ్డుకుంటాం



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ తదితరులు

కాచిగూడ, జూన్ 6: తెలంగాణలోని జలాలను ఆంధ్రకు తరలించకుండా అడ్డుకుంటామని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హెచ్చరించారు. ఈ నెల 9న సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కృష్ణను మింగారు– గోదావరి మీద పడ్డారు.. అనే అంశంపై నిర్వహించనున్న అఖిలపక్ష సమావేశానికి రావాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కాచిగూడ లో బీసీ సంక్షేమ జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తో కలిసి ఆయన మాట్లాడుతూ గత 57 సంవత్సరాలుగా ఆంధ్ర పాలకులు తెలంగాణలోని వనరులను దోచుకున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇష్టానుసారంగా తెలంగాణ జలవనులను దోచుకోవడానికి పొన్నాహాలు చేస్తున్నాడని, ఎట్టి పరిస్థితులలో తెలంగాణ జలాలను తరలించేందుకు ఒప్పుకోమని ఆయన హెచ్చరించారు. నదుల అనుసంధాన పథకానికి నర్మదా–గోదావరి కృష్ణ అనుసంధానంపై తప్ప గోదావరి–కావేరికి తెలంగాణ ఎలా ఒప్పుకుంటుందని ఆయన ప్రశ్నించారు. సుధాకర్, నందగోపాల్, రామలిం గం, ఉదయనేత పాల్గొన్నారు.

## మైనర్లు డ్రైవింగ్ చేస్తే రిజిస్ట్రేషన్లు రద్దు

కాచిగూడ, జూన్ 6: మైనర్లు వాహనాలను నడుపరాదని కాచిగూడ ట్రాఫిక్ సీఐ ఏ. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నింబోలిఅడ్డలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రెండు నెలల వ్యవధిలో కాచిగూడ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 70మంవొ మైనర్తు వాహనాతు నడుపుతూ పట్టుబడగా కేసులు నమోదు చేసినట్లు.. అందులో 24 వాహనాల రిజిస్ట్రేషన్ లను సంవత్సరం పాటు రద్దు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఎట్టి పరిస్థితులలో వాహనాలు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

## సన్మానం



జనరల్ సర్జరీ విభాగం విభాగాధిపతి డాక్టర్ పల్లం ప్రవీణ్‌ను సన్మానిస్తున్న దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్

సుల్తాన్‌బజార్, జూన్ 6 : జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వల్లం ప్రవీణ్ సాధించిన విజయాన్ని ఉస్మానియా దవాఖాన గర్వంగా పంచుకుంటుందని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాకేశ్ సహాయ్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో ఆయన జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పల్లం ప్రవీణ్‌ను శాలువా పుష్ప గుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేడ్ III మరియు గ్రేడ్ IV హెమోరాయిడ్స్ కోసం డాక్టర్ పల్లం ప్రవీణ్ రూపొందించిన పెయిన్‌లెస్ హైబ్రిడ్ లేజర్ శాండ్‌విచ్ విధానం చికిత్సని ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సర్జరీ ఆమోదించడం గర్వకారణమని అన్నారు. రోగికి సంప్రదాయిక ప్రక్రియ ఆపుకొనలేనితనం, దీర్ఘకాలిక నొప్పి, పునరావృతంతో సంక్లిష్టంగా ఉంటుందని అన్నా రు. డాక్టర్ ప్రవీణ్ రూపొందించిన విధానంతో నొప్పిలో సూపర్ ఫాస్ట్‌గా తగ్గింపు ఉండటంతో పాటు పునరావృతం దాదాపు సున్నా మరియు ఇది స్పింక్టర్‌ను రక్షించడం వలన ఆపుకొనలేనితనం ఉండదని అన్నారు. ఈ ప్రక్రియ చేయించుకుంటున్న రోగులు ఒకే రోజు ఇంటికి నడిచి వెళ్లడం అభినందనీయం అని అన్నారు. గత 4 సంవత్సరాలలో 500 కంటే ఎక్కువ శస్త్రచికిత్సలలో ఆయన ఈ కొత్త విధానాన్ని నిర్వహించారని తెలిపారు. ఈ పరిశోధనను ప్రఖ్యాత ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ సర్జరీ ప్రచురణ కోసం ఆమోదించిందని, ఈ ప్రక్రియ సంప్రదాయ, లేజర్ శస్త్రచికిత్సల ప్రయోజనాలను మిళితం చేస్తుందని రోగికి కనీస దాడితో వేగవంతమైన ఉపశమనాన్ని అందిస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఉస్మానియా మెడికల్ కాలేజీ, ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లోని అందరు అధ్యాపకులు డాక్టర్ పి. ప్రవీణ్ చేసిన పనిని ప్రశంసించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, డాక్టర్ పి. ప్రవీణ్ వైద్య రంగంలో విలువైన జ్ఞానాన్ని జోడించడాన్ని ప్రశంసించారు మరియు డాక్టర్ పల్లం ప్రవీణ్ చేసిన అసాధారణ కృషికి ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేశ్, రంగా అజ్మీర తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క తొలగించడానికి చర్యలు తీసుకుంటాం



లంగర్ హౌస్ చెరువు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శశిరేఖ

మెహిదీపట్నం, జూన్ 6 : ప్రజలకు దోమల బెడద లేకుండా చెరువులలో గుర్రపుడెక్కను తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 13 డిప్యూటీ కమిషనర్ శశిరేఖ అన్నారు. శుక్రవారం లంగర్‌హౌస్ చెరువు వద్ద స్థానికులతో కలిసి డిప్యూటీ కమిషనర్ శశిరేఖ పర్యటించారు. రెండు రోజుల క్రితం స్థానిక నాయకులు ఇంద్రసేనారెడ్డి, పూర్ణచందర్ తదితరులు గుర్రపు డెక్కను తొలగించాలంటూ జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. స్పందించిన అధికారులు శుక్రవారం లంగర్ హౌస్ చెరువు ప్రాంతంలో పర్యటించారు. డిప్యూటీ కమిషన్ శశిరేఖకు ఈ సందర్భంగా దోమల బెడద గురించి ఇంద్రసేనారెడ్డి వివరించారు. వెంటనే లంగర్హౌస్ చెరువు పై డ్రోన్ సహాయంతో రసాయనాలను పిచికారీ చేయించారు. గుర్రపు డెక్కను తొలగించే మిషన్ శాతం చెరువులో పనిచేస్తున్నదని అక్కడ పని పూర్తయిన తర్వాత లంగర్ హౌస్ చెరువులో పనులు ప్రారంభిస్తామని డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తెలిపారు.

## మహిళ అదృశ్యం



కుందన్‌బాయి

కాచిగూడ, జూన్ 6: కొడుకు ఇంటికి వెళ్లిన తల్లి అదృశ్యమైంది. కాచిగూడ ఎస్‌ఐ పి.రవికుమార్ వివరాల ప్రకారం.. చెప్పల్ బజార్‌కు చెందిన కుందన్ బాయి(80)ఈనెల 4 తేదీన పెద్ద కొడుకు ఇంటికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి కొడుకు ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు కలత చెంది వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చిన్న కుమారుడు సందీప్ కుమార్ శుక్రవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంట్లోంచి వెళ్లే సమయంలో కుందన్ బాయి ఆకుపచ్చ చీర, పసుపు రంగు జాకెట్ ధరించి, ఎత్తు 5.5 ఉన్నట్లు తెలిపారు. చిన్న కొడుకు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## కాచిగూడలో బాలిక..

కాచిగూడ, జూన్ 6: ఇంట్లోంచి బయటికి వెళ్లిన బాలిక అదృశ్యమైన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ డి.సుభాష్ వివరాల ప్రకారం.. లింగంపల్లి ప్రాంతానికి చెందిన చాకలి శిరీష(17)గురువారం ఇంట్లోంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కలత చెందిన తల్లి మంగమ్మ శుక్రవారం కాచిగూడ పీఎస్ లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి

కాచిగూడ, జూన్ 6: ఫుట్ పాత్ పై వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ డి.సుభాష్ వివరాల ప్రకారం.. బర్కత్ పుర ఫుట్ పాత్ పైన అనారోగ్యంతో శుక్రవారం మధు(37) మృతి చెంది ఉన్నాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

## వేర్వేరు రైళ్లలో దొంగతనం

కాచిగూడ, జూన్ 6: రాయచూర్ డెమో రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప విరాల ప్రకారం.. మహబూబ్ నగర్‌కు చెందిన రాహుఫ్(32) మక్తల్‌కు వెళ్లడానికి యాకత్ పుర రైల్వే స్టేషన్‌లో రాయచూర్ డెమో రైలు ఎక్కాడు. అక్కడే మాటు వేసిన గుర్తుతెలియని వ్యక్తి రాహుఫ్ జేబులోని ఖరీదైన ఫోన్ ను దొంగలించాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి తెలిపారు.


# మెథడిస్ట్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



అంతర్జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్

అబిడ్స్, జూన్ 6: ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ సాఫ్ట్ కంప్యూటింగ్‌లో సహకార పరిశోధన ప్రాముఖ్యత ఎంతో అవసరమని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ అన్నారు. మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రీసెంట్ అడ్వాన్స్మెంట్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ పై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు ముగింపు వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ప్రసంగిస్తూ సామాజిక సవాళ్లను పరిష్కరించేందుకు దేశ నిర్మాణానికి దోహదపడే ఏఐ ప్రాముఖ్యతను గుర్తించాలని అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహించినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు. సదస్సును మొదటి రోజైన గురువారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి కళాశాల కరెస్పాండెంట్ కే కృష్ణారావుతో కలిసి ప్రారంభించగా ఈ అంతర్జాతీయ సదస్సుకు అధ్యాపకులు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించిందని కళాశాల డైరెక్టర్ లక్ష్మీపతిరావు తెలిపారు. 18 రాష్ట్రాల్లోని 200 సంస్థల నుంచి 1800 మంది పైగా సహాయకులు 900 మంది పరిశోధన పత్రాలు సమర్పించినట్లు తెలిపారు. అదే విధంగా అమెరికా, ఇథియోపియా, మలేషియా నుంచిడి అంతర్జాతీయ సమర్పణలు కూడా సమర్పించారని పేర్కొన్నారు. క్రీవ్ ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రచురణ కోసం 377 పత్రాలను ఎంపిక చేశారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ లావణ్య పాములపర్తి, ప్రొఫెసర్ ఎం శారద వరలక్ష్మి, కన్వీనర్ డాక్టర్ టి.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ యుమాయాలి. ఏవో సచింద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరించిపోతున్న పేరిణి నృత్యకళ ను కాపాడుకోవాలి



పేరిణి నృత్యకారులతో వక్తలు డా.మామిడి హరికృష్ణ, పేరిణి సందీప్

రవీంద్రభారతి, జూన్ 6 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీమణి ద్వీప ఆర్ట్స్ అకాడమీ గురువు శ్రీ పేరిణి సందీప్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో జరిగిన పేరిణి నాట్యం 40 రోజుల ఫ్రీసమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. దాదాపు 100మంది పైగా విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొని పేరిణి నృత్యప్రదర్శను చేసి ఔరా అనిపించుకున్నారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ప్రత్యేక వక్తలుగా డా.పృథ్వీరాజ్, తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు, డాక్టర్ అనురాధదేవి, శ్రవణ్‌కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి నృత్యప్రదర్శను ప్రారంభించి మాట్లాడుతూ.. అంతరించి పోతున్న పేరిణి నృత్యాన్ని నాట్యగురువులు, ప్రభుత్వాలు పరిరక్షించి, భావి తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని వరంగల్ ప్రాంతానికి చెందిన ఈ పేరిణి నృత్యం ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందిందని ఆయన కొనియాడారు. పేరిణి నృత్యం శ్రీ పేరిణి సందీప్ చిన్నారులకు 40 రోజుల పాటు శిక్షణ ఇప్పించి రవీంద్రభారతిలో ప్రదర్శన ఇప్పించడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు పేరిణి నృత్యకారిణులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు బహూకరించారు.

## రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సాంగ్ హైదరాబాద్ బ్రాంచ్ మొదటి బీఈసీ సమావేశం నాంపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలోని కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవడమైనదని బ్రాంచ్ చైర్మన్ మధుసూదన్ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచ్ సెక్రటరీ దశరథ్. కోశాధికారి పి.సత్యకుమార్‌రెడ్డి. కుమార్ బొల్లా, ఆఫీస్ బేరర్లతో పాటు సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ శ్వేగి మురళీకృష్ణ, మాజీ డివిజనల్ ప్రెసిడెంట్ చౌదరి పాల్గొన్నారు.

– తెలుగుయూనివర్సిటీ, జూన్ 6

## బెంగాలీ నాటకాల ప్రదర్శన

రవీంద్రభారతి : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలో 2025 శుద్రాక్ హైదరాబాద్, ఎక్స్‌ప్రెషన్–3 బహుభాషా జాతీయ ఫెస్టివల్–సీజన్ 3 బెంగాలీ నాటకాల ప్రదర్శన ప్రారంభమైంది. మూడురోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ నాటక రచయిత బాదల్ సిర్కార్,చిత్ర నిర్మాత రిత్విక్ ఘటక్, మరియు స్వరకర్త సలీల్ చౌదరి జయంతి ఉత్సవాలను స్మరించుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించి, రూపొందించిన నాటక ప్రదర్శనలు, ఉపన్యాసాలు , సంభాషణలు నిర్వహిస్తారు.


## ఈద్గాల్లో నమాజ్ ఏర్పాట్ల పరిశీలన



బక్రీద్ సందర్భంగా సామూహిక ప్రార్థనల కోసం ముస్లింలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్ మొయినుద్దీన్, మాజీ దుస్సేన్‌లు అధికారులను కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ టోలిచౌకిలోని హకీంషా దర్గా వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అహ్మద్నగర్ ఫస్ట్ లాన్సర్ లో ఎమ్మెల్యే మాజీ హుస్సేన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– మెహిదీపట్నం, జూన్ 6


## గోల్కొండలో కాయకల్ప బృందం పర్యటన



సూపరింటెండెంట్ కార్యాలయంలో కాయకల్ప బృందంతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసరావు

మెహిదీపట్నం జూన్ 6 : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని గోల్కొండ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు, ఆసుపత్రి వాతావరణం, సౌకర్యాల గురించి కాయకల్ప బృందం పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పేదలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ రాపర్తి రాకేశ్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శివ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కాపు బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి



పూజలో పాల్గొన్న వీ.హెచ్, మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

కాచిగూడ, జూన్ 6: మున్నూరు కాపు బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు తెలిపారు. కాచిగూడలోని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన కార్యాలయాన్ని శుక్రవారం వీహెచ్ ప్రారంభించి పూజలు నిర్వహించారు. తెలంగాణ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి చదువుకునే మున్నూరుకాపు బాలికలకు సరైన వసతులు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, బాలికల కోసం ప్రత్యేక హాస్టల్ వసతికి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గంప చంద్రమోహన్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.